సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం। 18 । ఫిబ్రవరి । 2025



ఇప్ప పువ్వు.. కల్పతరువు

గిరిపుత్రులకు కాలానుగుణంగా లభించే ఇప్పపువ్వు అతి ప్రధానమైనది. వేసవి నుంచి మూడు నెలల పాటు అడవి బిడ్డలకు ఉపాధి కల్పిస్తుంది. 8లో



నెట్‌బాల్ విజేతగా 'పశ్చిమ'

అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి బాలికల జట్టు విజేతగా నిలవగా బాలుర జట్టు తృతీయస్థానం సాధించింది. 8లో



సుర్రుమంటున్న సూరీడు

ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఎండలు అదరగొడుతున్నాయి. గత వారం రోజుల నుంచి 40 డిగ్రీల చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

వైరస్ కోళ్లు ఖననం



తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లి పౌల్ట్రీలో కోళ్లను ఖననం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : బర్డ్ ఫ్లూ నేపథ్యంలో మండలంలోని పెదతాడేపల్లి పౌల్ట్రీ ఫారంలోని కోళ్లను సోమవారం వెటర్నరీ అధికారులు ఖననం చేశారు. వెటర్నరీ సిబ్బంది పీపీ కిట్లు ధరించి సుమారు 23 వేల కోళ్లను దశల వారీగా గోతుల్లో వేసి పూడ్చారు. వెటర్నరీ జేడీ మురళీకృష్ణ, డీడీ డాక్టర్ సుధాకర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, వెటర్నరీ ఏడీ డాక్టర్ అనిల్‌కుమార్, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి టి.రవిచంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల తొలగింపును నిరసిస్తూ ధర్నా



భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలోని కోర్టు పక్కన నివాసితుల ఇళ్లు తొలగించవద్దంటూ గణపతినగర్ పేదలు మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ పట్టణంలో బడాబాబులు ఆక్రమించిన స్థలాలు, కాల్వలను వదిలి పేదల ఇళ్లను తొలగించడం దారుణమన్నారు. గణపతినగర్‌లో చంటిపిల్లలు, వృద్ధులతో ఉంటున్న పేదల ఇళ్లు తొలగించడంతో చెట్టు కింద ఉండాల్సిన దుస్థితి కల్పించారని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి టెక్నికల్ పరీక్షలు

భీమవరం: డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈ నెల 19 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ తెలిపారు. పరీక్షలకు హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ హైస్కూల్లో నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 131 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు 19 నుంచి 22 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు జరుగుతాయని టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలు 19 నుంచి 20 వరకు నిర్వహిస్తామన్నారు.

చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: వివిధ రకాల సమస్యలతో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చేవారి సమస్యలను పూర్తిస్థాయిలో విచారణ చేసి పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం వినతులు స్వీకరించిన ఎస్పీ సంబంధిత పోలీసుస్టేషన్ల అధికారులతో మాట్లాడి సమస్యలను చట్ట ప్రకారం విచారణ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులతో గౌరవంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలని అనంతరం వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ క్యాంపులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని అంగన్‌వాడీ పిల్లల నమోదుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లలకు కొత్త ఆధార్ కార్డు నమోదుకు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి 18 నుంచి 21, ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు క్యాంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 99 ఆధార్ కేంద్రాలలో క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు.

కొత్త 'మోడల్'తో బడికి మూత

- ప్రభుత్వ బడులను తగ్గించే ఎత్తుగడ
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి నూతన విధానం అమలుకు కసరత్తు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న విద్యా శాఖ
- జిల్లాలో అనేక పాఠశాలలు మూతపడే అవకాశం



మండపాకలోని ఎంపీపీ పాఠశాల

సాక్షి, భీమవరం: మోడల్ ప్రైమరీ స్కూళ్ల పేరిట బడుల సంఖ్యను తగ్గించే దిశగా కూటమి సర్కారు ఎత్తుగడలు వేస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి నూతన విధానం అమలుకు కసరత్తు చేస్తోంది. జిల్లాలోని 409 పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లోని 143 వార్డుల పరిధిలో మొత్తం 1,436 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1, 2 తరగతులు కలిగిన ఫౌండేషన్ స్కూళ్లు(ఎఫ్ఎస్) 96 ఉండగా, 1 నుంచి 5వ తరగతి వరకు ఫౌండేషన్ ప్రైమరీ స్కూళ్లు(ఎఫ్‌పీఎస్) 1025 ఉన్నాయి. 1 నుంచి 7, 8వ తరగతి వరకు ప్రైమరీ హైస్కూళ్లు (పీహెచ్ఎస్) 43 ఉండగా, 3 నుంచి 10వ తరగతి వరకు హైస్కూళ్లు (హెచ్ఎస్) 43, 6 నుంచి 10వ తరగతి వరకు హైస్కూళ్లు (హెచ్ఎస్)144 ఉన్నాయి. జూనియర్ ఇంటర్ కలిగిన హైస్కూళ్లు (హెచ్ఎస్ ప్లస్) 20, ఎయిడెడ్/సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు 36 ఉన్నాయి.

మోడల్ స్కూళ్లకు ప్రతిపాదనలు

రానున్న విద్యాసంవత్సరం నుంచి గ్రామాల్లో కిలోమీటరు పరిధిలోని ఫౌండేషన్ ప్రైమరీ స్కూళ్ల పాఠశాలలను విలీనం చేసి ఎంపీఎస్‌లె ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. మోడరన్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు 60 మంది విద్యార్థులు ఉండాలి. ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు గతంలోనే మార్గదర్శకాలిచ్చింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీప పాఠశాలల్లో చేర్పిస్తారు. ఈ మేరకు గత డిసెంబరు 31 తేదీ నాటికి విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా 25 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న పాఠశాలలను గుర్తిస్తున్నారు. విలీనమయ్యాక ఎఫ్‌పీఎస్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో కేవలం 1, 2 విద్యార్థులకు సంబంధించిన ఫౌండేషన్ స్కూళ్లుగా అవి మారుతాయి. విద్యార్థుల సంఖ్య సరిపడనంత ఉన్న మిగిలిన పాఠశాలలను బేసిక్ ప్రైమరీ స్కూల్స్ (బీపీఎస్)గా గుర్తిస్తారు.

జిల్లాలో 311 మోడల్ స్కూళ్లు

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఇప్పటికే జిల్లాలో విలీన ప్రతిపాదిత పాఠశాలలను గుర్తించి ప్రాథమిక నివేదికను సిద్ధం చేశారు. దీని ప్రకారం జిల్లాలో 12 పాఠశాలలను యూపీఎస్‌లుగా కొనసాగించనుండగా, 311 మోడల్ ప్రైమరీ స్కూళ్లు (1-5వ తరగతి) ఏర్పాటు కానున్నాయి. 424 బీపీఎస్‌లు(1-5వ తరగతి), 424 ఎఫ్ఎస్ (1-2వ తరగతి), 230 హెచ్ఎస్‌లు (6-10వ తరగతి)లు ఏర్పాటుకానుండగా సోషల్, బీసీ వెల్ఫేర్ పాఠశాలలు యథావిధిగా ఉంటాయి.

తాజా నిర్ణయం వలన కొన్ని ఫౌండేషన్, బీపీఎస్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. దీనిని సాకుగా చూపించి కూటమి ప్రభుత్వం ఆయా పాఠశాలలను ఎత్తివేసే ఆలోచన చేయవచ్చునన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానంలో ఉపాధ్యాయులు మిగలడం వల్ల డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఖాళీ పోస్టులు తగ్గవచ్చన్న అభిప్రాయం ఉంది. ఇవి ప్రాథమిక అంచనా మాత్రమేనని తుది నివేదిక సిద్ధం కావాల్సి ఉందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

నాడు.. నాడు-నేడుతో మహర్దశ

పేదల విద్యకు పెద్దపీట వేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చారు. మన బడి నాడు-నేడుతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కొత్త ఊపిరిలూదారు. రూ. 369.11 కోట్ల వ్యయంతో డిజిటల్ క్లాస్‌రూంలు, తాగునీటి వసతి, టాయిలెట్స్, కిచెన్ షెడ్లు, ప్రహరీగోడలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యుద్దీకరణ, మేజర్, మైనర్ మరమ్మతులు తదితర అభివృద్ధి పనులు చేశారు. ఈ విద్యాసంవత్సరంలో తల్లికి వందనంకు కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టింది. ఇప్పుడు మోడల్ స్కూళ్ల పేరిట ప్రభుత్వం బడులను ఎత్తివేసే ఆలోచన చేస్తుందన్న వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

తణుకు రూరల్ మండపాక ఎస్సీ కాలనీలోని ఎంపీపీ పాఠశాల-3కు 95 ఏళ్ల చరిత్ర ఉంది. గ్రామానికి **చెందిన ఎంతోమంది విద్యావేత్తలు**, ఉద్యోగులు, ప్రముఖులు ఓనమాలు దిద్దింది ఇక్కడే. ప్రస్తుతం ఈ **పాఠశాలలో 25 మంది** విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ **(ఎంపీఎస్) కోసం కూటమి** ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో ఈ పాఠశాలలోని 3, 4, 5 తరగతుల **విద్యార్థులను సుమారు** రెండు కి.మీ దూరంలోని పాఠశాలలో విలీనం చేసేందుకు ప్రతిపాదించినట్టు **తెలుస్తోంది. అదే జరిగితే** ఇక్కడ 1, 2 తరగతులకు చెందిన కొద్దిమంది విద్యార్థులు మాత్రమే మిగులు**తారు. వారి కోసం ఈ పాఠ**శాలను కొనసాగిస్తారా? లేక.. విద్యార్థులు తక్కువగా ఉన్నారన్న కారణం**తో భవిష్యత్తులో మూసి**వేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తుంది



మండపాక ఎంపీపీ-3 పాఠశాలకు 95 ఏళ్ల చరిత్ర ఉంది. ఎంపీఎస్ పేరిట ఇక్కడి 3, 4, 5 తరగతులను రెండు కి.మీ దూరంలోని వేరే పాఠశాలలో విలీనం చేయడం సరికాదు. దీని వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– జంగం సురేష్ బాబు, ప్రైవేట్ టీచర్, మండపాక

మూసేయాలని చూస్తే ఉపేక్షించం



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే నిర్ణయాలను స్వాగతిస్తాం. మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు పేరిట కొన్ని పాఠశాలలను మూసేయాలని చూస్తే ఉపేక్షించేది లేదు. విద్యార్థులకు న్యాయం జరిగేలా వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తాం.

– ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్‌టీయూ, రాష్ట్ర అధ్యక్షుడు, భీమవరం

స్వాస్థ్య కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ నాగరాణి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: 18 ఏళ్లలోపు వయస్సు గల పిల్లలకు వచ్చే లోపాలు, వ్యాధులు గుర్తించడం, ఉచిత చికిత్స, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయడానికి రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్ స్కూల్లో సోమవారం ఆర్‌బీఎస్‌కే వాహనాన్ని ప్రారంభి విద్యార్థులతో మాట్లాడారు. చికిత్స అవసరమైన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం సమకూర్చిన ప్రత్యేక వాహనం ద్వారా తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం(డిఇఐసి)లో చికిత్సలు చేస్తారన్నారు. డీఇఐసీ కేంద్రంలో ప్రత్యేకంగా పిల్లల వైద్యులు, మెడికల్ అధికారి, డెంటల్ సర్జన్, ఫిజియోథెరపిస్ట్, సైకాలజిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఆడియోలాజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్, ఆప్టోమీటరిస్ట్, స్పెషల్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 1,98,895 పిల్లలకు పరీక్షలు నిర్వహించగా 1,043 మంది పిల్లల్లో సమస్యలు గుర్తించి తణుకులోని వైద్య సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భానునాయక్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ బి.భావన, డీఈవో ఇ.నారాయణ, డీఎన్నార్ విద్యాసంస్థల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మలేరియా అధికారులు, పంచాయతీ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా దోమల నివారణ, పారిశుద్ధ్యం, వర్మీ కంపోస్ట్ తయారీ, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై సమీక్షించారు. రాజమండ్రి నుంచి జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డీ సీహెచ్.నాగ నరసింహం జిల్లాలో దోమల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులకు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోజు, రోజుకు పెరిగిపోతున్న దోమలను నిర్మూలించేందుకు మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లో కూడా వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ స్థానంలో ప్రత్యామ్నాయ బయో ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి ఒక్కరు గుడ్డ సంచి, లేదా జ్యూట్ బ్యాగులను వెంట తీసుకెళ్లాలన్నారు. పారిశుద్ధ్యం పర్యవేక్షణకు ప్రతి వార్డుకు ఒక ప్రత్యేక అధికారిని, నోడల్ అధికారులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణ శ్రీ, మెప్మా అధికారి గ్రంధి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

చేపలు, మటన్‌కు క్యూ

- బర్డ్‌ఫ్లూతో తగ్గిన చికెన్ అమ్మకాలు
- చేపలు కిలోకు రూ.50 నుంచి రూ.70 వరకు పెంపు
- మటన్ కిలోకు రూ.200 నుంచి రూ.300 వరకు పెంపు



భీమవరంలో చేపలు, రొయ్యల దుకాణాలు

భీమవరం(ప్రకాశం చౌక్): బర్డ్ ఫ్లూ వైరస్ ప్రభావంతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చికెన్ దుకాణాలు మూతపడగా.. మిగిలిన ప్రాంతాల్లో చికెన్ కొనేవారు లేక కొనుగోళ్లు పడిపోయాయి. బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ అందుబాటులో లేకపోవడంతో చేపలు, మటన్ ధరలకు రెక్కలొచ్చాయి. మాంసాహారం తినేవారు చికెన్‌కు ప్రత్యామ్నాయంగా చేపలు, రొయ్యలు, మటన్ వినియోగంపై దృష్టిపెట్టారు. ఫంక్షన్లలో చికెన్‌కి బదులు చేపలు, మటన్, రొయ్య, పీతలు వాడుతున్నారు. ఈ నేపథ్యంలో వాటి ధరలు భారీగా పెరిగాయి. సాధారణ రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 4 వేల నుంచి 5 వేల కిలోల చికెన్ అమ్మకాలు జరిగేవి. రెస్టారెంట్లలో అధికంగా చికెన్ వాడేవారు. ఆదివారం చికెన్ వినియోగం మరింత ఎక్కువ. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ కారణంగా రోజుకు కనీసం 500 నుంచి 1000 కిలోలు కూడా అమ్మకాలు జరగడం లేదు. చికెన్ అందుబాటులో లేకపోవడంతో చేపలు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో చేపల ధరలు భారీగా పెరిగాయి. ఆయా రకం బట్టి కిలో రూ.150 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. రెండు నెలల ముందు చేపలు కిలో రూ.120 నుంచి రూ.140 వరకు పలికేవి. సముద్ర ఉత్పత్తులైన చేపలు, పీతల ధరలు కూడా పెరుగుతున్నాయి. రొయ్యలు కిలో రూ.500 నుంచి రూ.600 వరకు పెంచి విక్రయిస్తున్నారు. రెండు నెలల ముందు రొయ్యలు కిలో రూ.400 లోపు ఉండేవి. పీతలు నెల ముందు వరకు కిలో రూ.700 నుంచి రూ.750 వరకు ఉండగా, ప్రస్తుతం కిలో రూ.1000 ధర పలుకుతున్నాయి.

మటన్ మరింత ప్రియం

చికెన్ అమ్మకాలు లేకపోవడంతో మటన్ ధరలు దారుణంగా పెంచారు. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌కు ముందువరకు కిలో మటన్ రూ.800 నుంచి రూ.900 వరకు విక్రయించేవారు. ఇప్పుడు ఏకంగా రూ.1000 నుంచి రూ.1100కి పెంచి అమ్ముతున్నారు.



భీమవరంలో అమ్మకాలు లేక మూతబడ్డ చికెన్ దుకాణాలు

పశ్చిమ గోదావరి జిల్లాలో

	రెండు నెలల క్రితం ధర(రూ.లలో)	ప్రస్తుత ధర (రూ.లలో)
మటన్	800	1,100
చేప	150	200
రొయ్య	150 - 190	220 - 260
చికెన్ (బాయిలర్)	240	180
చికెన్ (ఫారం కోడి)	180	50

ఏలూరు జిల్లాలో..

మటన్	రూ.800	మార్పు లేదు
చికెన్	రూ.240	రూ.150

మేకలకు, గొర్రెలకు డిమాండ్



చికెన్ అమ్మకాలు తగ్గిపోవడంతో మటన్ అమ్మకాలు పెరుగుతున్నాయి. దీంతో మేకలు, గొర్రెలకు డిమాండ్ పెరిగింది. మటన్ వ్యాపారులు, ఫంక్షన్ల కోసం తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వెళ్లి మేకలు, గొర్రెలు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం అక్కడ మార్కెట్‌లో మేకలు, గొర్రెలకు మంచి డిమాండ్ ఉంది.

– ఎస్‌కే హుస్సేన్, మటన్ వ్యాపారి

క్షేత్రస్థాయి పర్యటనకు నిధుల విడుదల

భీమవరం: జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల రాష్ట్ర పర్యటనకు జిల్లాలోని 82 పాఠశాల ఎంపికచేయగా ఒక్కొకరికి రూ.200 చొప్పున రూ.16,400 కేటాయించిందని, రాష్ట్రేతర పర్యటనకు 82 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి రూ.1.64 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో 20 మంది బాలురు, 40 మంది బాలికలు, 20 మంది టీచర్లు, 125 మంది గైడ్ టీచర్లు, ఏఎంఒ, డీఎస్‌వోతో సహా మొత్తం 207 మంది రాష్ట్ర పర్యటనకు రూ.4.14 లక్షలు, రాష్ట్రేతర పర్యటనకు రూ.4.14 లక్షలు కేటాయించినట్లు తెలిపారు.

బలివే ఉత్సవాల్లో సౌకర్యాలకు ప్రాధాన్యం



స్నాన ఘట్టాల ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

బలివే(ముసునూరు) : భక్తుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, అందరి సహకారంతో బలివే మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయనున్నట్లు ఉత్సవాల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉత్సవాల నోడల్ అధికారి, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించామని, పంచాయతీరాజ్, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో భక్తుల స్నానాలు, దైవ దర్శనానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నూజివీడు, ఏలూరు రహదారుల మరమ్మతులు తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఉత్సవ ప్రాంగణ పరిసరాల్లో మద్యం విక్రయాలు లేకుండా ఆ శాఖలను అప్రమత్తం చేశామన్నారు.

ఆర్డీఓ కార్యాలయం తనిఖీ



గూడెం ఆర్డీఓ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్

తాడేపల్లిగూడెం: రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామ సభల్లో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో రికార్డులను సోమవారం ఆయన పరిశీలించారు. అంతకు ముందు జేసీ మండలంలోని నవాబుపాలెంలో రీ సర్వే పనులను పరిశీలించారు. రైతుల సమక్షంలోనే రీ సర్వే పనులను నిర్వహించాలన్నారు. గ్రామంలో రికార్డుల ప్రకారం జరుగుతున్న రీ సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలు నివృత్తి చేశారు. రీ సర్వేకు సంబంధించి ముందుగా నోటీసులు అందిస్తున్నారా అని రైతులను అడిగారు. ఆర్డీఓ, జిల్లా రెవిన్యూ అధికారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: మాతా, శిశు సంక్షేమంపై పాలకులకు చిత్తశుద్ధి లేదని దీనికి కేంద్ర బడ్జెట్ నిదర్శనమని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు విమర్శించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాను ద్దేశించి ఆయన మాట్లాడారు. వేతనాల పెంపు కోసం, రాజకీయ వేధింపులు ఆపాలని, పని ఒత్తిడి తగ్గించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీలు మరోసారి ఆందోళనకు సిద్ధం కాక తప్పదని పిలుపునిచ్చారు. పెరిగిన ధరలు, చాలీచాలని వేతనాలు, వివిధరకాల పేర్లతో ఆన్‌లైన్ సేవలప్పగించడం వంటి సమస్యలు అంగన్‌వాడీలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ తాత్సారం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, గొర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి బృందాలను తరలిస్తున్న బస్సుల సీజ్



రవాణా శాఖ అధికారులు సీజ్ చేసిన స్కూల్ బస్సు

భీమవరం(ప్రకాశం చౌక్) : పెళ్లి బృందాలను తీసుకెళ్తున్న మూడు స్కూల్ బస్సులను రవాణా శాఖ అధికారులు అడ్డుకుని సీజ్ చేసి, జరిమానా విధించారు. భీమవరం నుంచి గణపవరం వెళుతున్న రెండు బస్సులు, ఆకివీడు వెళుతున్న ఒక బస్సును సీజ్ చేసి మూడు బస్సులకు కలిపి రూ.1,85,540 జరిమానా విధించినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు తెలిపారు. గురజాడ విద్యానికేతన్ (గణపవరం), ఇండియన్ డిజిటల్ స్కూలు(గణపవరం), భారతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ(ఆకివీడు)కు చెందిన బస్సులు సీజ్ చేసినట్లు చెప్పారు. పెళ్లిళ్లకు, ఇతర కార్యక్రమాలకు స్కూల్ బస్సులను వినియోగించడం చట్ట విరుద్ధమని చెప్పారు.

క్లుప్తంగా

వర్గీకరణ చేస్తే ప్రాణత్యాగాలకు సిద్ధం



మాట్లాడుతున్న చీకటమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ దేశ వ్యాప్తంగా చేయాలి తప్పా. తమ స్వార్థ ప్రయోజనాల కోసం తెలుగు రాష్ట్రాల పరిధిలో చేస్తే ప్రాణత్యాగాలు చేయడానికి కూడా సిద్ధమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రావడానికి మాలలే ప్రముఖ పాత్ర వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు మాలలు కృషి చేస్తే అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంద కృష్ణకు అనుకూలంగా ఎస్సీ వర్గీకరణ చేసేందుకు చూస్తున్నారని, ఇది సరికాదన్నారు. మందకృష్ణ మాత్రం మతతత్వ పార్టీ బీజేపీకి మద్దతు ఇస్తున్నారని, ఈ విషయాన్ని ఇతర పక్షాలు గుర్తించాలని వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నరసింహయ్య, ఏపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పుష్పాంజలి, మహానంది, శేషు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన బంగారయ్య

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం కనకాపురంలో సోమవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ పైప్ లీక్ అయ్యి మంటలు చెలరేగడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బంగారయ్య వంట కోసం గ్యాస్ స్టౌను వెలిగించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో గ్యాస్ పైప్ లీక్ అవ్వడంతో మంటలు చెలరేగి అతనికి తీవ్ర గాయాలయ్యాయి. బంగారయ్యను చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా మంటలు ఆర్పేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా గ్యాస్ సిలిండర్ కావడంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎస్సై నవీన్‌కుమార్ అక్కడికి చేరుకుని ఆ మంటలను ఆర్పించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: లారీ ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి చెందాడు. రూరల్ ఎస్సై జేవీఎన్ ప్రసాద్ తెలిపిన వివరాలివి. ముత్యాలంబాపురం గ్రామానికి చెందిన పప్పు సంజీవరావు (64) సోమవారం తన మోటారు సైకిల్‌పై దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా పెదతాడేపల్లి జాతీయ రహదారిపై ఏపీ 28 టిడి 5445 నెంబరు గల లారీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుడ్ని తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై సంజీవరావు కుమారుడు అశోక్ కుమార్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సారా తయారీదారుల అరెస్ట్

చాట్రాయి: సారా తయారీదారులను అరెస్ట్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మస్తానరావు తెలిపారు. మండలంలోని పోతనపల్లి తండాలో సారా నేరాలకు పాల్పడుతున్న హసావతు బాలరాజు, వడిత్యా బిక్షాలు, ధారావతు శ్రీరాములను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తిరువూరు కోర్టుకు తరలించినట్లు సోమవారం ఆయన చెప్పారు.

ఇప్ప పువ్వు.. గిరిజనుల కల్పతరువు

- పోషకాలు పుష్కలం.. వైద్య శాస్త్రంలోనూ ప్రాధాన్యత
- వేసవి నుంచి మూడు నెలల పాటు అడవి బిడ్డలకు ఉపాధి
- గిట్టుబాటు ధర లేక.. తగ్గుతున్న పువ్వుల సేకరణ
- జీసీసీ ద్వారా ఇప్ప పువ్వు కొనుగోలు చేయాలని డిమాండ్



ఇప్ప చెట్టు



ఎండిన ఇప్ప పువ్వు

బుట్టాయగూడెం: ఆదివాసీ గిరిపుత్రులకు అడవిలో లభించే ఉత్పత్తులే జీవనాధారం. అందులోనూ కాలానుగుణంగా లభించే ఇప్ప పువ్వు అతి ప్రధానమైనది. వేసవిలో మాత్రమే దొరికే వీటిని విక్రయించి గిరిజనులు ఉపాధి పొందుతుంటారు. తెల్లవారుజామునే అడవిలోకి వెళ్లి ఇప్పపువ్వును గిరిజనులు సేకరిస్తారు. చెట్లపై నుంచి కిందపడిన ఇప్ప పువ్వును మధ్యాహ్నానికి సేకరించి ఇంటికి తెచ్చి ఎండబెడతారు.

మూడు నెలల పాటు ఉపాధి

మన్య ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ఇప్ప చెట్ల ద్వారా మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. ఖరీఫ్, రబీ పనులు ముగిసే సమయానికి ఇప్ప చెట్లు విరగ పూస్తాయి. వీటి పువ్వులు గాలికి నేలరాలుతుంటాయి. ఈ పువ్వులను గిరిజనులు సేకరిస్తారు. వీటితోపాటు మొర్రి పండ్లు సేకరించి ఇంటికి తీసుకువస్తుంటారు. వీటిని సేకరించి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో విక్రయించి ఉపాధి పొందుతుంటారు.

ఔషధాల తయారీ

గిరిజనులు సేకరించిన ఇప్ప పువ్వును జీసీసీల ద్వారా కొనుగోలు చేస్తుంటారు. ఇప్ప పువ్వును ఔషధాల తయారీకి విక్రయిస్తారు. ఈ పువ్వు నుంచి తీసిన తైలాన్ని పక్షవాతం వంటి వ్యాధులకు ఉపయోగిస్తారు. అలాగే దంతాలను శుభ్రం చేసుకోవడంతోపాటు దగ్గుకు, దంతాలకు సంబంధించిన వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుంది. ప్రధానంగా స్వచ్ఛమైన ఇప్ప పువ్వుతో తయారు చేసిన సారాను సేవిస్తే వృద్ధాప్య లక్షణాలు త్వరగా రాకుండా ఉంటాయని గిరిజనులు అంటున్నారు. వైద్యశాస్త్రంలోనూ ఇప్ప పువ్వు ప్రాధాన్యతను సంపాదించుకుంది. ఆయుర్వేదంలోనూ మధుక వృక్షం అని పేరుపొందింది. గిరిజన ప్రాంతంలోని ప్రజలు ఈ ఇప్పచెట్లను మాతృమూర్తిగా భావిస్తారు.

ఇప్ప పువ్వులో ఎన్నో పోషకాలు

అడవిలో లభించే ఇప్ప పువ్వుల గింజల నుంచి తీసిన నూనెలో ఎన్నో పోషక విలువలున్నట్లు శాస్త్రీయంగా నిరూపించబడింది. భారత శాస్త్రీయ సాంకేతిక మంత్రిత్వ శాఖ సహాయంతో 1999లో నిర్వహించిన పరిశోధనలో ఎండిన ఇప్ప పువ్వుల నుంచి పంచదారను తయారు చేసి దీనితో జామ్, కేక్‌లు, చాక్లెట్‌లు తయారు చేసే విధానాన్ని కనిపెట్టారు. ఇప్పపువ్వు ఎక్కువకాలం నిల్వ ఉండడానికి మధ్యమధ్యలో ఎండిన వేప ఆకును వేస్తే ఎక్కువ కాలం నిల్వ ఉంటుందని తెలుసుకున్నారు. కొందరు గిరిజనులు ఇప్పపువ్వును ఆహారంగా కూడా తీసుకుంటారు.

ధరలేక ఇప్ప పువ్వు సేకరణపై తగ్గిన ఆసక్తి

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంతో పాటు పాపికొండల అభయారణ్యంలో ఇప్ప చెట్లు దాదాపుగా 10 వేలకు పైగా ఉండవచ్చని అంచనా. ముఖ్యంగా బుట్టాయగూడెం మండలం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఈ ఇప్ప చెట్లు అధికంగా ఉన్నాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో కూడా దాదాపుగా 5 వేల చెట్ల వరకూ అటవీ ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో నాటి వాటిని పెంచుతున్నారు. గిరిజనులు సేకరించిన ఈ ఇప్ప పువ్వులను జీసీసీ అధికారులే కాదు బయటి నుంచి అనేక మంది వ్యాపారులు కూడా కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. ప్రస్తుతం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గుత్తుకోయలు, బుట్టాయగూడెం మండలంలో కొండరెడ్లు ఈ పువ్వులను సేకరిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే సరైన ధర లభించకపోవడంతో కాలక్రమేపీ గిరిజనులు కూడా ఇప్ప పువ్వు సేకరణపై ఆసక్తి చూపడంలేదు. అలాగే పలుచోట్ల ఇప్ప పువ్వు చెట్లను కూడా నరికివేస్తున్నట్లు సమాచారం.

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి



“మా గ్రామ సమీపంలోని అడవుల్లో ఇప్ప పువ్వుతో పాటు పలు ఉత్పత్తులు లభిస్తున్నాయి. ప్రస్తుతం ఇప్ప పువ్వు సీజన్ ప్రారంభమవుతుంది. జీసీసీ ద్వారా ఇప్ప పువ్వు కొనుగోలు చేయాలి.

– కెచ్చెల బాలిరెడ్డి, కొండరెడ్డి గిరిజనుడు, మోదేలు

సరైన ధర లేక..



సరైన ధర రాకపోవడంతో గిరిజనులు ఇప్ప పువ్వుల సేకరణకు ఆసక్తి చూపడంలేదు. రానురానూ చెట్లు కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. అటవీశాఖ ఆధ్వర్యంలో చెట్లను పెంచడంతోపాటు జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి.

– కారం రాఘవ, న్యూడెమొక్రసీ నాయకులు, అలివేరు

నకిలీ నగలతో ముత్తూట్‌లో రుణం

సంస్థలో పనిచేసే ఇద్దరిపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ప్రైవేట్ ఫైనాన్స్ దుకాణంలో పని చేస్తున్న సిబ్బందే నకిలీ నగలు తాకట్టుపెట్టి భారీగా డబ్బులు కాజేశారు. ఈ మోసం బయటపడడంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు పవర్‌పేటలో ముత్తూట్ ఫైనాన్స్ పేరుతో బంగారు నగల తాకట్టు దుకాణం ఉంది. ఈ బ్రాంచ్‌లో ఏలూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు పనిచేస్తున్నారు. వీరు కొంతకాలం క్రితం ముత్తూట్ ఫైనాన్స్‌లో నకిలీ నగలను తాకట్టుపెట్టి రూ.12,31,600 రుణంగా తీసుకున్నారు. బ్రాంచ్‌లో పనిచేస్తున్న సిబ్బంది కావడంతో పూర్తి స్థాయిలో తనిఖీ చేయకుండానే రుణం మంజూరు చేశారు. రెండు రోజుల క్రితం ముత్తూట్ ఫైనాన్స్ రీజనల్ మేనేజర్ వేల్పూరి రాజేష్ ఏలూరులోని పవర్‌పేట బ్రాంచ్‌కు వచ్చారు. ఆయన బ్రాంచ్‌లో తాకట్టు పెట్టిన బంగారు నగలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో తాకట్టులోని నగలు నకిలీగా నిర్ధారించారు. ఈ నగలను తాకట్టు పెట్టిన వ్యక్తుల వివరాలు ఆరా తీయగా బ్రాంచ్‌లో పనిచేస్తున్న సిబ్బందిగా గుర్తించారు. దీనిపై రీజనల్ మేనేజర్ రాజేష్ ఏలూరు టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగకళ్యాణి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పిచ్చికుక్క దాడి.. 8 మందికి గాయాలు

కొయ్యలగూడెం: కన్నాపురంలో పిచ్చికుక్క స్వైర విహారంతో 8 మంది గాయాలపాలయ్యారు. దీంతో గ్రామస్తులు ఆ పిచ్చికుక్కను వెంటాడి హతమార్చారు. పిచ్చికుక్క మరికొన్ని కుక్కలపై దాడి చేసిందని, ఈ నేపథ్యంలో మిగిలిన కుక్కల పరిస్థితి పట్ల అప్రమత్తతతో ఉండాలని గ్రామస్తులు సూచిస్తున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోస్తనీ కాలువలో దూకి మహిళ గల్లంతు

వంతెనపై ఉన్న ఆమె బూట్ల ఆధారంగా గోస్తనీ కాలువలో గాలింపు



గుమ్మళ్ల శాంతి (ఫైల్)

తణుకు అర్బన్: గోస్తనీ కాలువలో దూకి మహిళ గల్లంతైన ఘటన తణుకు సజ్జాపురం ప్రాంతంలోని జాతీయరహదారి వంతెన ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం సజ్జాపురంలో నివసిస్తున్న గుమ్మళ్ల శాంతి (48) ఆదివారం రాత్రి 2.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు రావడం.. ఆపై కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు, స్నేహితులు సోమవారం ఉదయం నుంచి వెతుకులాట చేపట్టారు. ఈ క్రమంలో ఆమె కాళ్లకు వేసుకునే బూట్లు గోస్తనీ కాలువ వంతెనపై భాగంలోని జాతీయరహదారిపై ఉండడంతో రాత్రి సమయంలో కాలువలోకి దూకి ఉంటారని కుటుంబసభ్యులు, పోలీసులు భావిస్తున్నారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సహకారంతో గజ ఈతగాళ్లు గోస్తనీ కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. మహిళ కాలువలో దూకారనే వార్త తెలిసిన సజ్జాపురవాసులతోపాటు జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు వంతెన ప్రాంతంలో భారీగా చేరుకుని గుమిగూడారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.





వంతెనపై గుమికూడిన ప్రజలు, తణుకు గోస్తనీ కాలువలో అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు

వెల్‌నెస్ సెంటర్ కోచ్‌గా శాంతి

సజ్జాపురం పార్కు ప్రాంతంలో తన ఇద్దరు కుమారులతో కలిసి శాంతి నివసిస్తోంది. భర్త లేకపోవడంతో తన నివాసంలోనే వెల్‌నెస్ సెంటర్ కోచ్‌గా ఆమె ఉపాధి పొందుతోంది. శాంతి అందరితో కలుపుగోలుగా ఉండే స్వభావమని, సామాజిక మాధ్యమాల్లో సైతం రీల్స్ చేస్తూ హుషారుగా ఉంటుందని స్నేహితులు చెబుతున్నారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కుమారులిద్దరిలో ఒకరికి వివాహం కూడా అయినట్లు బంధువులు వివరిస్తున్నారు. శాంతి కాలువలో దూకినట్లుగా ఎవరూ చూడకపోవడంతో గోస్తనీ కాలువ వంతెనపై ఉన్న బూట్లు ఆధారంగా మాత్రమే కాలువలో దూకినట్లు అంచనా వేస్తున్నారు.

నేను చెప్పినట్టు నడుచుకోవాల్సిందే!

- కర్ర పెత్తనం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి
- లోకేష్ టీం పేరుతో బెదిరింపులు
- ట్రిపుల్ ఐటీలో అధికారులపై ఒత్తిడి
- విద్యార్థులపై లేనిపోని ఫిర్యాదులు
- వివాదాస్పదంగా బోధనేతర ఉద్యోగి తీరు



నూజివీడు ట్రిపుల్ ఐటీ

నూజివీడు: రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో ఎంతో కొంత మెరుగ్గా ఉన్న నూజివీడు ట్రిపుల్ ఐటీలో టీడీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి బోధనేతర ఉద్యోగి వ్యవహార శైలి తీవ్ర చర్చనీయాంశమవుతోంది. రానురాను అతని తీరు ట్రిపుల్ ఐటీ అధికారులను సైతం ఇబ్బంది పెట్టేలా పరిణమించడం గమనార్హం. ఏ నిర్ణయం తీసుకోవాలన్నా తనకు చెప్పాలని, నేను చెప్పినట్లే అందరూ నడుచుకోవాలంటూ డైరెక్టర్, ఏవోలకు సైతం హుకుం జారీ చేస్తుండటంతో మిగిలిన ఉద్యోగులందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికి ఇవ్వాలి, ఎవరిని తొలగించాలో కూడా తానే చెప్తానంటూ తన మాటే శాసనం అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో అధికారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. తనకు ప్రత్యేకంగా డిపార్ట్‌మెంట్ ఇవ్వాలని, సెంట్రల్ డీన్ హోదా ఇవ్వాలని, తన డిజిగ్నేషన్ మార్చాలని, జీతం పెంచాలని ఒత్తిడి తీసుకువస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. అంతేగాకుండా తనకు లోకేష్ తెలుసని, లోకేష్ టీం తెలుసంటూ ట్రిపుల్ ఐటీలోని అధికారులను బెదిరిస్తూ కర్రపెత్తనం చేస్తుండటం, తనకు నచ్చని వారికి అదనపు బాధ్యతలు ఇస్తే వారిని ఆ బాధ్యతల నుంచి తొలగించాలంటూ ఒత్తిడి చేయడం నిత్యకృత్యంగా మారిందనే ప్రచారం జరుగుతోంది.

విద్యార్థులపైనా వేధింపులు

ఒకవైపు అధికారులపై కర్ర పెత్తనం చేస్తుండటంతో పాటు తమకు నచ్చని విద్యార్థులపైనా వేధింపులు చేస్తున్నారనే ప్రచారం చేస్తున్నారు. ఎవరైనా విద్యార్థులు తమకు నచ్చిన హీరో ఫొటోనో, నాయకుడి ఫొటోనో ఫోన్‌లస్టాటస్‌గా పెట్టుకుంటే ఆ విద్యార్థులపై చర్యలు తీసుకోవాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తుండటంపై ట్రిపుల్ ఐటీలో సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ట్రిపుల్ ఐటీలను స్థాపించి 16 ఏళ్లు అవుతున్నప్పటికీ ఇంత దారుణమైన పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని పలువురు వాపోతున్నారు. ఈ ఉద్యోగితో పాటు కొందరు ప్రభుత్వ అనుకూల వర్గంగా ఏర్పడి తమకు అనుకూలంగా లేని ఉద్యోగులపై ఫిర్యాదులు సైతం చేస్తుండటం గమనార్హం. ఈ పరిస్థితుల్లో బయటి నుంచి కనబడే శత్రువు కంటే మనలోని కనబడని శత్రువు నుంచే ట్రిపుల్ ఐటీలో ఎక్కువ సమస్యలు వస్తున్నాయంటూ ఒక అధికారి పేర్కొన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. ఇంతకీ ఆ బోధనేతర ఉద్యోగి కాంట్రాక్టు ఉద్యోగి కావడం కొసమెరుపు.

23 నుంచి శివయ్య కల్యాణోత్సవాలు

26న రాత్రి స్వామివారి కల్యాణం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివయ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 1 వరకు ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 23న ఉదయం 10 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారునిగాను, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల అభిషేకం అనంతరం స్వామివారి కల్యాణోత్సవం, ఆ తర్వాత గ్రామోత్సవం జరుగుతుంది. వచ్చేనెల 1న ఆలయంలో జరిగే శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈఓ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ కల్యాణోత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.



గర్భాలయంలో కొలువైన స్వామివారికి హారతులిస్తున్న అర్చకుడు



ద్వారకాతిరుమల క్షేత్రపాలకుని ఆలయ ముఖ ద్వారం

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ విజేత ‘పశ్చిమ’



విజేతగా నిలిచిన జిల్లా బాలికల జట్టు



తృతీయస్థానం సాధించిన బాలుర జట్టు

పాలకోడేరు: రాష్ట్రస్థాయి అండర్ 19 బాలబాలికల నెట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు విజేతగా నిలవగా జిల్లా బాలుర జట్టు తృతీయస్థానం సాధించిందని జిల్లా నెట్ బాల్ సంఘ కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 16 17 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలోని డాన్ బాస్కో హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అండర్ 19 బాల బాలికల నెట్ బాల్ పోటీలు జరిగాయన్నారు. విజేతలకు తూర్పుగోదావరి జిల్లా నెట్ బాల్ సంఘ అధ్యక్షుడు కె.అశోక్ రెడ్డి, డాన్ బాస్కో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఐ.బల్కదర్ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ నెట్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కోచ్ పి.దావూద్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాకారులను పలువురు అభినందించారు.

సూరీడు.. అప్పుడే సుర్రుమంటున్నాడు

- వేసవి ప్రారంభంలోనే హెచ్చరికలు జారీ చేస్తున్న ఎండలు
- ఉమ్మడి జిల్లాలో 40 డిగ్రీల చేరువలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- తేమశాతంలో భారీ హెచ్చుతగ్గులు
- ఉక్కబోతలు కూడా ప్రారంభం



ఎండవేడికి ఇబ్బంది పడుతూ ప్రయాణం సాగిస్తున్న ఓ కుటుంబం

నరసాపురం: ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఎండలు అదరగొడుతున్నాయి. సూరీడు సుర్రుమంటూ రానున్న రోజుల్లో తన ప్రతాపం ఎలా ఉండబోతుందోననే హింట్ ఇస్తున్నట్టుగా ఉంది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గత వారం రోజుల నుంచి 40 డిగ్రీల చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంకా ఫిబ్రవరి మాసం ద్వితీయార్థంలో ఉన్నాము. సాధారణంగా మార్చి చివరివారం నుంచి క్రమేపీ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. కానీ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే వేసవి తాలూకా ప్రభావం కనిపిస్తోంది. మొన్నటి వరకూ చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ప్రస్తుతం కూడా జిల్లాల్లో మంచు ప్రభావం చాలా ప్రాంతాల్లో కనిపిస్తున్నప్పటికీ, ఉదయం పూట ఉష్ణోగ్రతలు మాత్రం పెరిగాయి. దీనిని బట్టి రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు ఎంత పెద్ద స్థాయిలో ఉంటాయో? అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు గాలిలో ఉండే తేమశాతంలో కూడా భారీ హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. దీంతో రాత్రిపూట కూడా ఉక్కబోత ప్రజలను కాస్త ఇబ్బంది పెడుతుంది.

తగ్గుతున్న తేమశాతం.. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

సాధారణంగా పగటి పూటల్లో గాలిలో తేమశాతం 50 శాతం పైనే నమోదవుతుంది. తెల్లవారుజామున 95 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో గాలిలో తేమ శాతం పడిపోతోంది. పగటిపూట 40 నుంచి 50 శాతం, తెల్లవారుజాము సమయంలో 85 నుంచి 90 శాతంగా గత 10 రోజులుగా నమోదవుతోంది. ఇక ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతున్నాయి. గత 10 రోజులుగా ఉమ్మడి పశ్చిమలో అత్యధికంగా 38 నుంచి 41 డిగ్రీలు, అత్యల్పంగా 32 నుంచి 37 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పుడే ఇలా ఉంటే, ఈ సంవత్సరం వేసవి మొత్తం భానుడు తన ప్రతాపాన్ని గట్టిగానే చూపించే అవకాశాలు కనిపిస్తున్నాయని వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్యులు

మొన్నటి వరకూ శీతాకాలం. ఇప్పుడు చలిగాలులు తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వృద్ధులు, మధుమేహం, అధిక రక్తపోటు వంటి దీర్ఘకాల రోగాలకు మందులు తీసుకుంటున్న వారు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతుంటారని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 10వ తరగతి, ఇంటర్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

భర్త, అత్తమామల వేధింపులే కారణమని సోదరుడి ఫిర్యాదు

భీమవరం అర్బన్: ఓ మహిళ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భీమవరం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గూట్లపాడు గ్రామానికి చెందిన ఆకుల శ్రీరామ్మూర్తికి, అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నందిపువారిపాలెంకు చెందిన ఆకుల దేవి సాయి రామ నాగలక్ష్మి (29)కి 2018లో వివాహమైంది. అప్పట్లో పసుపు కుంకుమల కింద 50 సెంట్లు భూమి, రూ. 3 లక్షలు, ఆడపాడుచలు లాంఛనంగా రూ.లక్షా 50 వేలు, 5 కాసులు బంగారం ముట్టజెప్పారు. కొంతకాలం దాంపత్య జీవితం సాఫీగా సాగింది. వీరికి బాబు, పాప ఉన్నారు. గత కొంత కాలంగా రామ నాగలక్ష్మిని భర్త శ్రీరామ్మూర్తి, అత్త వరలక్ష్మి, మామ ఆదినారాయణమూర్తి, ఆడపాడుచులు ముత్యాల పష్పవతి, మేడ్పర్ల లక్ష్మి, సీహెచ్ సత్యవాణి వేధిస్తున్నారు. భీమవరంలో నివసిస్తున్న శ్రీరామ్మూర్తి తన కుటుంబంతో కలిసి ఈ నెల 15న సొంతూరు గూట్లపాడు గ్రామానికి వచ్చాడు. 16వ తేదీన బాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అయితే సోమవారం ఏమైందో తెలియదు కాని రామ నాగలక్ష్మి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా భర్త, అత్తమామల వేధింపుల కారణంగానే తన అక్క మృతి చెందిందని దేవి సాయి రామ నాగలక్ష్మి సోదరుడు నందిపు వీర వెంకట సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్సై ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలగలేరులో చోరీ

పెనుమంట్ర: వెలగలేరు శివాలయం సమీపంలో సోమవారం తెల్లవారుజామున తాళం వేసిన ఇంటిలో దొంగలు పడి బంగారు ఆభరణాలు, నగదును అపహరించారు. గ్రామానికి చెందిన పడాల సూర్యకుమారి వారం రోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి వైజాగ్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లింది. అయితే సోమవారం ఉదయం తలుపులు తెరచి ఉండటాన్ని గమనించిన స్థానిక బంధువులు సమాచారాన్ని ఆమెకు తెలియజేయడంతో వైజాగ్ నుంచి వచ్చిన ఆమె పెనుమంట్ర పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ చోరీలో ఇరవై మూడున్నర కాసుల బంగారం, రూ.1.80 లక్షల నగదును దొంగలు దోచుకుపోయినట్లు ఆమె బంధువులు తెలిపారు. పెనుమంట్ర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బర్డ్ ఫ్లూతో కుదేలైన పౌల్ట్రీ రంగం

- చికెన్ షాపులు వెలవెల
- మాంసాహారం కొనుగోలుకు ప్రజలు దూరం
- వ్యాపారుల ఆశలు గల్లంతు

తణుకు అర్బన్ : కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధిసోకడం ఆపై చికెన్, కోడిగుడ్ల అమ్మకాలపై నిషేధం విధించడంతో వ్యాపార రంగంతోపాటు కార్మికులు అల్లాడిపోతున్నారు. ఈనెల 11వ తేదీన తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని కృష్ణానందం పౌల్ట్రీస్‌లోని కోళ్లకు ఇన్‌ఫ్లుఎంజా వైరస్ నిర్ధారణ కావడంతో 10 కిలోమీటర్ల పరిధిలోని తణుకు నియోజకవర్గంలో ఆ రోజునుంచి కోళ్లు, చికెన్, కోడిగుడ్లపై అధికారులు నిషేధాజ్ఞలు జారీచేశారు. దీంతో చికెన్, కోడిగుడ్లతో నడిచే వ్యాపారాలన్నీ మూతపడ్డాయి. అంతే కాకుండా కోళ్ల ఫారమ్స్ నిర్వహిస్తున్న రైతాంగంతో పాటు కార్మికులు రోడ్డునపడ్డారు. ప్రస్తుతం రెడ్ జోన్‌లోని కోళ్ల ఫారాల్లో వైరస్ సోకిన కోళ్లను కల్లింగ్ చేసి ఫారమ్స్‌ను శానిటైజేషన్ చేస్తున్నారు.

వ్యాపారాలు అతలాకుతలం..

రిటైల్‌గా చికెన్ విక్రయాలు చేసే వ్యాపార దుకాణాలకు తాళంపడగా వ్యాపారులతోపాటు పని చేసే కార్మికులు సైతం మూలనపడ్డారు. కిరాణా, కిళ్లీకొట్లుకు కోడిగుడ్ల సరఫరా చేస్తూ చిల్లర వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు సైతం రోడ్డున పడిన దుస్థితి నెలకొంది. ఇక చికెన్ అందుబాటులో లేకపోవడంతో రోడ్డు పక్కన చిన్నపాటి హోటల్స్ నుంచి రెస్టారెంట్‌ల వరకు వ్యాపారాలు లేక బెంబేలెత్తిపోతున్నారు. ఇక స్ట్రీట్‌ఫుడ్‌గా పిలవబడే న్యూడుల్స్, ఫ్రైడ్ రైస్ బండ్లు సైతం కోడిగుడ్లు చికెన్ లేకపోవడంతో వ్యాపారాలు జరగడంలేదని వాపోతున్నారు. వెజ్ ఆహారం మాత్రమే అమ్మకాలు చేస్తుండ డం వలన సగానికిపైగా వ్యాపారం పడిపోయిందని చిరు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. వైరస్ ప్రభావం తగ్గి చికెన్, కోడిగుడ్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయా అని ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి నెలకొందని వ్యాపారులు, కార్మి కులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వ్యాపారం జరుగుతుంది కదా అని పెట్టుబడిగా చీటీలతోపాటు వడ్డీలకు అప్పులు తీసుకుని వ్యాపారంపైనే కదుతున్నామని నేడు వ్యాపారాలు పడిపోవడంతో డబ్బులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని చిరు వ్యాపారులు చెబుతున్నారు.



వేల్పూరులో వైరస్ సోకిన కోళ్ల ఫారమ్



తణుకు స్త్రీ సమాజం రోడ్డులో మూతపడ్డ కోడి గుడ్ల దుకాణం



తణుకు పిండిమర్ల వీధిలో బేరాల్లేక ఖాళీగా ఉన్న న్యూడుల్స్ దుకాణం



తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో మూతపడ్డ చికెన్ దుకాణం

సగానికిపైగా వ్యాపారం పడిపోయింది



చికెన్, కోడిగుడ్లు లేకపోవడంతో ఫ్రైడ్ రైస్ వ్యాపారం గతంకంటే సగానికిపైగా పడిపోయింది. వారం రోజులుగా వ్యాపారం జరగడంలేదు. న్యూడుల్స్ వ్యాపారం అంటేనే కోడిగుడ్డుతో ముడిపడి ఉంటుంది. ఆ రుచికి అలవాటు పడిన ప్రజానీకం వెజ్ ఐటమ్స్‌గా చేస్తుంటే ఇష్టపడడం లేదు. వైరస్ తగ్గగానే చికెన్, గుడ్లు అందుబాటులోకి తీసుకురావాలి.

– ఎం.దుర్గాప్రసాద్, వ్యాపారి, తణుకు

చికెన్ దుకాణాలు మూతపడ్డాయి



కోళ్లకు వచ్చిన వైరస్ కారణంగా వారం రోజుల నుంచి చికెన్ వ్యాపారాలు మూతపడ్డాయి. చికెన్ దుకాణాలు మూసేయాలని మునిసిపల్ అధికారులు నోటీసులు జారీచేయడంతో దుకాణాలు మూతవేసేశాం. అయితే మా వ్యాపారం ఎలా ఉన్నా పనిచేసే వారికి జీతాలు ఇవ్వడం తదితర ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నాం. కోవిడ్ తర్వాత మళ్లీ నేడు బర్డ్‌ఫ్లూ కారణంగా వ్యాపారాలు మూతపడ్డాయి.

– కోతాడ వెంకటరమణ, చికెన్ వ్యాపారి, తణుకు

ప్రభుత్వం ఆదుకోవాలి



బర్డ్‌ఫ్లూ కారణంగా పౌల్ట్రీ రంగంలోని కోళ్ల రైతులు, కార్మికులు, అనుసంధాన వ్యాపారాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి రైతులను, కార్మికులను, చిరు వ్యాపారులను ఆదుకోవాలి. అలర్ట్ జోన్ ప్రాంతాల్లో మూడునెలలపాటు నిషేదాజ్ఞలు జారీ చేయడంతో చికెన్, కోడిగుడ్లు వ్యాపార రంగం అతలాకుతలం అయిపోయి మాంసం విక్రయించే చిరు వ్యాపారులు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వేలాది కుటుంబాలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి.

– బళ్ల చినవీరభద్రరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, తణుకు

క్లుప్తంగా

శ్రీవారి ఆలయానికి విరాళం



కుంచనపల్లి శ్రీవారి ఆలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం అచ్యుత అశోక్ కుమార్ రూ.7,116లు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ట్రస్ట్ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్ చైర్మన్ దాసరి మల్లిఖార్జునరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



పెంటపాడు గేట్‌సెంటర్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

పెంటపాడు: లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలు అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పెంటపాడు గేట్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ దేశంలో కార్మికుల ఉపాధికి విఘాతం కలిగేలా ఉన్న లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని మరిచి పాలన కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, పెనగంటిదుర్గ, వడ్డాది సన్యాసి, జె. శ్యామల, దత్తు రాము, వెన్నెల శ్రీను, బంకూరు చిన్న పాల్గొన్నారు.

రామాలయం తొలగించొద్దు



రహదారిపై బైఠాయించిన గ్రామస్తులు

కాళ్ల: మండల కేంద్రంలో రహదారిని ఆనుకుని ఉన్న రామాలయం తొలగించటానికి వీలు లేదంటూ సోమవారం రాత్రి గ్రామస్తులు రోడ్డెక్కారు. గ్రామంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న రామాలయం తొలగిస్తారని గతవారం రోజులుగా చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో పార్టీలకతీతంగా గ్రామస్తులు సోమవారం రామాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా రామాలయం తొలగించడానికి వీల్లేదని యువకులు, గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఒక్కసారిగా కొంతమంది యువకులు రహదారిపై బైఠాయించి నిరసన తెలపడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీనితో గ్రామపెద్దలు కలగజేసుకుని యువకులకు నచ్చచెప్పడంతో విరమించారు.

సత్తెమ్మ జాతర ముగింపు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉండి: పెదపుల్లేరు గ్రామంలో వేంచేసియున్న సత్తెమ్మ అమ్మవారి ఆలయ 60వ వార్షిక జాతర మహోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి నైవేద్యం సమర్పించిన అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు, భీమవరం, గణపవరం, కైకలూరు తదితర మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 8వ తేదీ శనివారం నుంచి 16వ తేదీ ఆదివారం వరకు జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

విద్యతోనే ఉన్నత స్థితి



పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న దృశ్యం

పెనుగొండ: విద్యతోనే ఉన్నత స్థితికి చేరుకోవచ్చునని కాకినాడ సీనియర్ సివిల్ జడ్జి బీరా శ్రీనివాస్ అన్నారు. సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990–91 విద్యా సంవత్సర పదో తరగతి విద్యార్థులు ఆర్థిక సాయంతో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. 1998–99 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు అందించిన కంప్యూటర్‌ను పూర్వ విద్యార్థి సీనియర్ సివిల్ జడ్జి బీరా శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి), చిట్టూరి నాగరాజు, పాలూరి పోతురాజు పాల్గొన్నారు.

నేటి నుంచి చిన్న పిల్లలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

అత్తిలి: మండలంలో ఈనెల 18 నుంచి 28 వరకు ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి శామ్యూల్ సోమవారం తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గల ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదుతో పాటు ఆధార్ అప్‌డేషన్ చేస్తారని చెప్పారు. ఈనెల 18న పాలూరు, 19,20 తేదీలలో కొమ్మర, 21న ఈడూరు, కెఎస్ గట్టు, 18, 19 తేదీల్లో మంచిలి, తిరుపతిపురంలో 20, 21 తేదీల్లో ఆరవల్లి 20న గుమ్మంపాడు, 24, 25 తేదీల్లో, కంచుమర్రు, పాలి గ్రామాల్లో 27, 28 తేదీల్లో స్కిన్నెరపురం, ఉరదాళ్లపాలెం, 24న దంతుపల్లి, 25, 27న ఉనికిలి, 28న దంతుపల్లి గ్రామాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



గూడెం పట్టణం వ్యూ

తాడేపల్లిగూడెం: ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో 13 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలో పది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉత్తరం వైపు ఏడు ఎనిమిది రూమ్‌లు, పడమర వైపున తొమ్మిది, పది రూమ్‌లను సిద్ధం చేశారు. సుబ్బారావుపేట మునిసిపల్ హైస్కూల్‌లో కొత్త భవనంలో నాలుగు, ఐదు రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఈవీఎం మునిసిపల్ హైస్కూల్‌లో మూడు గదులను పోలింగ్ కేంద్రాలుగా సిద్ధం చేశారు. పెంటపాడులో పోస్టుబేసిక్ స్కూల్‌లో రెండు గదులు, డీఆర్ గోయంకా ప్రభుత్వ కళాశాలలో ఒక గదిని ఈ ఎన్నిక కోసం ఏర్పాటు చేశారు.

గూడెంలో 8,244 మంది ఓటర్లు

నియోజకవర్గంలో 8244 మంది ఓటర్లు ఉన్నారు. గూడెం పట్టణంలో ఉన్న పది పోలింగ్ బూత్‌ల్లో 6,381 మంది ఓటర్లు ఉండగా, పెంటపాడు మండలంలో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాల్లో 1863 మంది ఓటర్లు ఉన్నారు. ఈ మేరకు సంబంధిత అధికార్లు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సమస్యల పరిష్కారం కోరుతూ మునిసిపల్ కార్యాలయం వద్ద సోమరవాం దశలవారీ ఆందోళనా కార్యక్రమాలను నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ మునిసిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన భద్రత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ ఇంచార్జ్ కమిషన్ వెంకట రమణకు వినతి పత్రం అందజేశారు. వక్తలు మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన అప్కాస్‌ను రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అది నిజమే అయితే దానిపై ముందుగా కార్మిక సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. ఏరియా కమిటీ కార్యదర్శి మండలపర్తి హరీష్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావులు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, సిబ్బంది సంఖ్య, వాహనాలు సంఖ్య పెంచాలని, సరెండర్ లీవు, మూడు డీఏలు విడదుల చేయాలని కోరారు. దశల వారి ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: రీ-సర్వే పనులను అధికారులు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో రీ-సర్వే గ్రౌండ్ ట్రూతినింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్ మాట్లాడుతూ ముందుగా రైతులకు నోటీసులు అందజేయాలన్నారు. నోటీసులు అందజేసినా ఆరుగురు రైతులు రావడం లేదని గ్రామ సర్వేయర్ జేసీ దృష్టికి తీసుకురాగా, వారిని పిలిచి మాట్లాడి, సర్వే పనులు పూర్తయ్యేలా సహకరించాలని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి కోరారు. రైతుల సమక్షంలోనే రీ-సర్వే పనులు చేయాలన్నారు. భూయజమానులకు తెలియకుండా సర్వే పనులు చేయరాదని అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. భూమి విషయంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ముందుగా అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, జిల్లా సర్వే అధికారి కే.జాషువా, తహసీల్దార్ సునీల్ కుమార్, రెవెన్యూ, సర్వే అధికారులు, రైతులు ఉన్నారు.



రీ-సర్వే పనులపై సిబ్బందిని ఆరా తీస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

ఘనంగా భక్తాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ

పెంటపాడు: మండలంలోని వెలంపేటలో నూతనంగా నిర్మిస్తున్న భక్తాంజనేయస్వామి ఆలయ పునః నిర్మాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ దేవాదాయశాఖ ద్వారా అందజేసిన నిధులతో గత ప్రభుత్వంలో ఈ ప్రాంతంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. గౌరీదేవి అమ్మవారి ఆలయానికి రూ. కోటి నిధులు అందజేసినట్లు పేర్కొన్నారు. దేవాలయాల సందర్శన ద్వారా ప్రజలు ఆధ్యాత్మిక అభివృద్ధి సాధించాలన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. వెలమ సంక్షేమసంఘ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, వెలమ సంక్షేమ సంఘ ప్రతినిధులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పెంటపాడు నీటిసంఘ అధ్యక్షుడు బండారు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కూటమి నాయకులు తదితరులు శంకుస్థాపన పూజల్లో పాల్గొన్నారు.



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెంటపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ. లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఆరోగ్య అవగాహనలో భాగంగా చింతపల్లి గ్రామంలో డ్రైడే, కార్యక్రమాలు నిర్వహించారు. దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి నాయకులు

పెంటపాడు: అంగన్‌వాడీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రతిపాడు అంగన్‌వాడీ ప్రాజెక్టు వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది కూటమి ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల సంఘ జిల్లా అధ్యక్షురాలు కె. ఝాన్సీలక్ష్మి రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నేటికీ అమలు చేయడం లేదన్నారు. గతేడాది అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలపై సమ్మె చేయగా కూటమి నాయకులు శిబిరాలకు వచ్చి తాము అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, గద్దెనెక్కి 9 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలును ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేయాలని, కరెంట్, టీఏ బిల్లులు, అద్దెలు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి పీవోకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సెక్టార్లకు చెందిన నాయకులు ఆర్. అనూరాధ, జి. గాయత్రి, కె. ప్రసన్నలక్ష్మి, కనకలత, జయలక్ష్మి, కల్యాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు సీడీపీవో పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

తణుకు అర్బన్: మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గత 17రోజులుగా నిర్వహిస్తున్న పౌష్టికాహార పంపిణీని సోమవారం పారిశ్రామికవేత్త, తణుకు పట్టణ మానవతా సంస్థ ముఖ్య సలహాదారు మల్లిన అరుణ సారథి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమని విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని తెలిపారు. సోమవారం అల్పాహారాన్ని ఏర్పాటు చేసిన పట్టణానికి చెందిన మద్దిపాటి సుమన్‌ను అభినందించారు. అనంతరం అరుణసారధిని మానవత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాఠశాల పధానోపాధ్యాయులు తానాబత్తుల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కన్వీనర్ విస్తరణ, అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, మానవతా సభ్యులు కె.వాణి, డాక్టర్ కె. రామలక్ష్మి, దాట్ల సత్యనారాయణ రాజు, పులమాల వీరభద్రం, మణిదీప్, మద్దిపాటి మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

న్యాయమూర్తి చిరంజీవిరావు సేవలు అభినందనీయం

తణుకు అర్బన్: న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించే కక్షిదారులకు తగిన న్యాయం అందించడంలో న్యాయమూర్తి పీఎస్‌పీ చిరంజీవిరావు సేవలు అభినందనీయమని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. 2018 నుంచి తణుకు స్పెషల్ మెజిస్ట్రేట్‌గా పనిచేసిన న్యాయమూర్తి చిరంజీవిరావు సోమవారం పదవీ విరమణ సందర్భంగా కోర్టు ఆవరణలో ఆయనను న్యాయమూర్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్యవతి మాట్లాడుతూ న్యాయమూర్తి సుదీర్ఘకాలం కక్షిదారులకు సత్వర న్యాయసేవలు అందిస్తూ అందరి ప్రశంసలు పొందారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎస్ రంజిత్ కుమార్, బెంచ్ కోర్టు న్యాయమూర్తి, టి.ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయమూర్తి చిరంజీవిరావును సత్కరించిన నాల్గవ అదనపు జిల్లా జడ్జి సత్యవతి, న్యాయమూర్తులు

విలేకరిపై టీడీపీ నాయకుడి దాడి దుర్మార్గం



తణుకులో డీటీ శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: పార్వతీపురం జిల్లా మక్కువ గ్రామానికి చెందిన ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు దాడి చేయడాన్ని తణుకు ఏరియా ప్రెస్ క్లబ్ సభ్యులు ఖండించారు. సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దార్ ఎస్.శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ సభ్యుల నిర సనకు మద్దతు తెలిపిన ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న విలేకరిపై టీడీపీ మండల అధ్యక్షుడు దాడి చేయడం, చంపుతానంటూ బెదిరించడం అత్యంత హేయమైన చర్యగా భావించాలని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వంలో విలేకరులపై అనేక దాడులు జరుగుతుండడం బాధాకరమని, నిజాలను నిర్భయంగా రాస్తే దానికి స్పందించి సమాధానం ఇవ్వాలే, కానీ రాసే కలంపై దుర్మార్గంగా దాడికి దిగడాన్ని ఐలూ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దాడికి పాల్పడిన టీడీపీ మండల అధ్యక్షుడిపై తగిన చర్యలు తీసుకోవాలని, విలేకరికి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు ఏరియా ప్రెస్‌క్లబ్ సభ్యులు బెల్లంకొండ బుచ్చిబాబు, కొడమంచిలి కృష్ణ, టి.దొరబాబు, బి.రామ్‌కుమార్, పంజా శివ, పి.ఏడుకొండలు, ఎం.కనకేశ్వరరావు, కె.రాజా, సీహెచ్‌డీ రాజశేఖర్, బడేటి బాబు, రిషి, మడిపల్లి సాయి, గుమ్మడి ఆంజనేయులు, హరీష్, రాంప్రసాద్, నారాయణరెడ్డి, న్యాయవాదులు గొల్లపల్లి అంబేద్కర్, ప్రతాప్, ఎం.శాంసన్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

పెనుగొండ: స్థానిక లింగాల వీధిలోని ఉమాసోమేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారు జాం నుంచి ఆలయ అర్చకుడు కొండవీటి సత్యనారాయణ మూర్తి ఉమాసోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.